క్లుప్తంగా

అభివృద్ధి పనులకు రూ.30 వేలు వితరణ

కామేపల్లి: పండితాపురం గ్రామంలోని సమ్మక్క–సారక్క అమ్మవారి గద్దెల వద్ద అభివృద్ధి పనులకు ముచ్చర్ల గ్రామానికి ధనూరి బాలరాజు–నాగమణి దంపతులు శుక్రవారం రూ.30 వేలు వితరణగా అందజేశారు. గద్దెల అభివృద్ధి పనులకు దాతలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

ఆలయానికి గ్యాస్ సామగ్రి..

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామంలోని శీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి దేవాలయానికి కామేపల్లి సాయి తిరుమల ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు భూక్యా లక్ష్మణ్‌నాయక్ గ్యాస్ సామగ్రి వితరణ చేశారు. సుమారు రూ.10వేలు విలువైన గ్యాస్ స్టవ్, సిలిండర్, ఇతర సామగ్రిని శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందించి ఆలయ, భక్తుల సౌకర్యార్థం అందజేసినట్లు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా ఉదయ్‌కుమార్, పుచ్చకాయల చిన్న వెంకటేశ్వర్లు, కోటయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ గాంధీనగర్ హైస్కూల్ విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన శుక్రవారం రూ.10 వేలు విలువ కలిగిన పెన్నులు, పుస్తకాలను అందించారు. క్లబ్ సభ్యులు కురువెళ్ల లక్ష్మీకాంతారావు జన్మదినం సందర్భంగా ఆయన అందించిన ఆర్థిక సాయంతో ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.కృష్ణారెడ్డి, వి.హనుమంతరావు, జనార్దన్, పూర్ణచందర్‌రావు, గోవర్ధన్, కృష్ణమూర్తి, గోపాల్, దుర్గా నాగేశ్వరరావు, హెచ్‌ఎం రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అధికారం కోసం అల్లర్లు సృష్టిస్తున్నారు..'

ఖమ్మంమయూరిసెంటర్: దేశాన్ని మతాల పేరుతో అల్లర్లు సృష్టిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు అధికారం కోసం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం అన్నారు. శుక్రవారం కిరాణ జాగీర్ మర్చంట్ హాల్‌లో జెట్టి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, భూక్య రవీందర్ నాయక్, బొల్లెపల్లి సత్యనారాయణ, ఎస్.కుమార్, బాలకృష్ణ, అహ్మద్ షరీఫ్, భాషా, సురేష్, సీహెచ్.వెంకన్న, నక్క లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి సమగ్ర చట్టం చేయాలి

రఘునాథపాలెం: వ్యవసాయ రంగంపై ఆధారపడి పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు వారి ఆర్థిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టాలు చేసి అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మికల సమస్యలతో కూడిన వినతిపత్రంను తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌కు అందించాక మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఫిబ్రవరి 16వ తేదీన నిర్వహించే గ్రామీణ బంధు కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.నవీన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ప్రతాపనేని వెంకటేశ్వరావు, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు కన్నెగంటి తిరుపతయ్య, కార్యదర్శి ఎస్‌కె.ఇమామ్‌తో పాటు సారంగి పాపారావు, ఎస్‌కె.యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

కామేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని పండితాపురానికి చెందిన బత్తుల రామారావు కుటుంబ కలహాలతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కాసేపయ్యాక గమనించిన కుటుంబీకులు 108కు సమాచారం ఇవ్వగా ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సెలవు కోసం పాఠశాలలో వాగ్వాదం

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో సెలవు కోసం ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయుడి నడుమ శుక్రవారం వాగ్వాదం జరిగింది. తెలుగు ఉపాధ్యాయురాలు పద్మ తన కుమార్తె వివాహం సందర్భంగా సెలవు ఇవ్వాలని కోరగా..హెచ్‌ఎం శ్యాంసన్ నిరాకరించారు. అంతేకాక సెలవు ఇవ్వలేనంటూ ఆయన సెలవు చీటీ చించి పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో మహిళా ఉపాధ్యాయులంతా నిరసన తెలిపినట్లు సమాచారం. ఈ విషయమై హెచ్‌ఎం శ్యాంసన్ వివరణ ఇస్తూ.. ఈనెల 5 తర్వాత సెలవులు ఇస్తానని చెప్పానే తప్ప ఎలాంటి వాగ్వాదం జరగలేదని తెలిపారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డేది?

సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు

- అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా..
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..
- ఎటు చూసినా మూడు నుంచి ఐదు అంతస్తుల భవనాలే దర్శనం
- పట్టించుకోని కేఎంసీ అధికారులు
- ఫిర్యాదులు ఇస్తే నోటీసులతోనే సరి



బైపాస్‌లో రహదారిని ఆనుకుని చేపడుతున్న నిర్మాణం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడంలేదు. ప్రభుత్వం మారినా.. పాలకులు హెచ్చరించినా.. అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలను చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాంతాల్లో నిర్మాణాల సంఖ్య రెట్టింపు స్థాయిలో పెరిగింది. ఎక్కడా చూసినా మూడు నుంచి ఐదు అంతస్తుల భవన నిర్మాణాలే కనిపిస్తున్నాయి. ఇక కమర్షియల్ ప్రాంతాల్లో ఈ భవనాల నిర్మాణాలు అడ్డగోలుగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సిన అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో నిబంధనలు అతిక్రమించి మరీ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. 168 జీఓ ప్రకారం అనుమతులు తీసుకొని నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ చట్టం చెబుతున్నా.. యజమానులు దానిని విరుద్ధంగా ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలతో అనేక ఇబ్బందులు తలెత్తడంతో పాటు సెట్‌బ్యాక్ లేకుండా భవనాలు నిర్మించడంపై వందల సంఖ్యలో కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందినా.. పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నిబంధనలు బేఖాతర్..

ఖమ్మం టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల తీరుతో భవన నిర్మాణదారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగరంలో ప్రస్తుతం కమర్షియల్ ప్రాంతాలతో పాటు రెసిడెన్షియల్ ప్రాంతాల్లో నిర్మించిన భవనాలను పరిశీలిస్తే ఈ విషయం బహిర్గతమవుతుంది. బైపాస్ రోడ్డులోకి కొత్తబస్టాండ్ వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు భారీగా పెరిగాయని, అందుకు టౌన్ ప్లానింగ్ అధికారులే కారణమనే చర్చ సాగుతుంది. కనీసం పార్కింగ్ సౌకర్యం లేకుండా స్టిల్ట్‌లో సైతం నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహర్తిస్తున్నారే తప్ప వాటిని పరిశీలించడం లేదు.

అనుమతులకు విరుద్ధంగా..

- భవన నిర్మాణాలు అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్నాయి. నగరంలో రెసిడెన్షియల్ జోన్లలో 250 గజాల లోపు జీ ప్లస్ 2కు అనుమతులు పొంది ఏకంగా నాలుగైదు అంతస్తులను నిర్మిస్తున్నారు.
- బుర్హాన్‌పురంలో ఆంజనేయస్వామి దేవాలయం సమీపాన జీ ప్లస్ 2కు అనుమతులు పొంది ఏకంగా ఐదు ఫ్లోర్లు నిర్మించడమే కాకుండా సెల్లార్, సిల్ట్ నిర్మాణం లేకుండా భవనాన్ని పూర్తి చేశారు.
- దర్గా ప్రాంతంలో మరో భవనం సెట్ బ్యాక్ లేకుండా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారు.

ఇలా అనుమతులు ఒకలా తీసుకొని.. నిర్మాణాలు మరోలా చేపట్టిన భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు. కేఎంసీలో టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయనంత కాలం అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉంటాయన్న విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నగరంలో జరుగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ అడగగా అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామని, త్వరలోనే వీటిని కూల్చివేస్తామని చెబుతున్నారు.

కనిపించని సెట్ బ్యాక్

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మున్సిపల్ చట్టం ప్రకారం సెట్‌బ్యాక్ లేకుండా నూతన భవన నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పును బట్టి నిర్మాణాలకు సెట్ బ్యాక్ వదలాల్సి ఉంటుంది. మూడు అడుగుల నుంచి 20 అడుగుల వరకు రోడ్డు వెడల్పు. భవన నిర్మించే స్థలం వైశాల్యం ప్రకారం సెట్‌బ్యాక్ వదలాలి. 40 అడుగుల లోపు వెడల్పు గల రోడ్డు పక్కన చేపట్టే 240 గజాల స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు భవనానికి ముందు భాగంలో కనీసం 5 అడుగులు, మిగిలిన మూడు వైపుల 3 అడుగులకు పైనా సెట్ బ్యాక్ వదలాలి. వంద అడుగుల రోడ్డు పక్కన నిర్మించే భవనాలకు 400 గజాల నుంచి 500 గజాలలోపు నిర్మించే భవనాలకు భవనం ముందు భాగంలో 20 అడుగుల సెట్‌బ్యాక్ తప్పనిసరిగా వదలాలి. కాని భవన నిర్మాణదారులు అవేవి పట్టించుకోవడం లేదు. ప్రధానంగా రాపర్తినగ్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు ఇప్పటి వరకు జరిగినా.. కొత్తగా జరుగుతున్న నిర్మాణాలకు సెట్ బ్యాక్ ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరంలో సెట్‌బ్యాక్ లేకుండానే కొత్తగా నిర్మాణాలను చేపట్టారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచాలి..



సమావేశంలో పాల్గొన్న కమిషనర్, సూపర్‌వైజర్లు

ఖమ్మంమయూరిసెంటర్: పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతీ జవాన్ 15 రోజుల షెడ్యూల్ పెట్టుకుని డివిజన్ కవర్ అయ్యేలా కాల్వలు శుభ్రం చేయించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో పార్క్ సూపర్‌వైజర్లు, డివైడర్ మెయింటెనెన్స్ సూపర్‌వైజర్లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్, ఫాగింగ్ వర్కర్స్‌తో వేర్వేరుగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ వైజర్, జవాన్‌లు ఏం పనిచేస్తారు..? ఆయన పరిధిలో వర్కర్లు ఎంతమంది ఉంటారు.. అని ఆరా తీసి పలు సూచనలు చేశారు. ప్రతీ పార్కును ఉదయం 5 గంటలకు ఓపెన్ చేయాలని, 9.30 గంటలకు మూసివేయాలని, సాయంత్రం 4.30 గంటలకు ఓపెన్ చేసి.. రాత్రి 9 గంటలకు మూసివేయాలని చెప్పారు. డివైడర్ మెయింటెనెన్స్ సూపర్‌వైజర్ తప్పనిసరిగా ఏ రోజు ఎక్కడ పని చేస్తున్నారనేది ఒక పుస్తకం పెట్టుకొని రోజువారీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని డివైడర్ కవర్ అయ్యేలా చూసుకోవాలని సూపర్వైజర్‌లను ఆదేశించారు. ప్రతీ జవాన్ ఉదయం 5 గంటలకే డివిజన్‌లోకి వచ్చి 5:30 గంటలలోపు శానిటరీ వర్కర్ల బయోమెట్రిక్ తీసుకోవాలని నిర్దేశించిన ప్రాంతానికి పంపాలన్నారు. అనంతరం రోజువారీ ఫాగింగ్ మెయింటెనెన్స్ పుస్తకాన్ని పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



బోరును పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

కామేపల్లి: ప్రభుత్వ పథకాలను రైతులు సక్రమంగా వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం గిరి వికాస్ పథకం కింద జోగ్గూడెం గ్రామానికి చెందిన రైతు జర్పుల రవీందర్‌కు మంజూరైన వ్యవసాయ బోరును స్థానిక అధికారులతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకం వల్ల కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ శ్రీరాణి, టీఏ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్యా, కార్యదర్శి ధరావత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులు ఐక్యత చాటాలి

కూసుమంచి: క్రైస్తవులు ఐక్యంగా ఉంటూ ప్రభుత్వం ద్వారా అందే పథకాలను పొందాలని తెలంగాణ క్రైస్తవ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు, పాస్టర్ జి.లూకరాజు తెలిపారు. శుక్రవారం నేలపట్లలో జరిగిన పాస్టర్ల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులు, చర్చిల మీద జరుగుతున్న దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని, దాడులు జరుగకుండా ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన కోరారు. ఐక్యవేదిక సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాస్టర్ బోయాజు, పాస్టర్లు మోషే, రాజ్‌కుమార్, ఆశీర్వాదం, పాల్, యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ఖమ్మంవన్‌టౌన్: ప్రతీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీతో గడువు ముగుస్తుండడంతో పట్టభద్రులు త్వరగా ఓటుహక్కును నమోదు చేసుకొని తమ అమూల్యమైన ఓటును వినియోగించుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని టౌన్–2 మామిళ్లగూడెం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్ డిపో వెనుక ప్రాంతం, రామాలయం సెంటర్, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ వెనక మామిళ్లగూడెం ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే టౌన్–3 పరిధిలో 11 కేవీ జమ్మిబండ ఫీడర్ విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైరా రోడ్, జెడ్పీ సెంటర్, జమ్మిబండ, సీక్వెల్ రోడ్, పాత కలెక్టర్ కార్యాలయం వెనుక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా తెలిపారు. అంతేకాక నగరంలోని టౌన్–5 రామాలయం సబ్ స్టేషన్ పరిధిలో కమాన్ బజార్ ఫీడర్ విద్యుత్ లైన్ నిర్వహణ పనులతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాలవారి వీధి, షాదీఖానా ఏరియా, స్టేషన్ రోడ్, బొమ్మనా సెంటర్, శాంతి లాడ్జ్, వినోద థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ ఏఈ ప్రభాకర్ తెలిపారు. అంతేకాక నగరంలోని ఖమ్మం అర్బన్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా 11కేవీ పాకబండ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధురానగర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గొల్లగూడెం రోడ్డుకు ఇరువైపులా, మధురానగర్ కాలనీ, హనుమాన్‌నగర్, వరదయ్య నగర్, రాఘవయ్యనగర్, నటరాజ్‌నగర్ ప్రాంతాల్లో అంతరాయం కలగనుంది.

ఎంపీటీసీకి స్టాఫ్ నర్సు ఉద్యోగం



ఎంపీటీసీ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక ఎంపీటీసీ బలుసుపాటి సుజాత ప్రభుత్వం ఇటీవల నియామకం చేపట్టిన ఆరోగ్యశాఖ ఉద్యోగాల భర్తీలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం సాధించింది. ఇప్పటివరకు ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసి.. ఇక నుంచి వైద్యసేవలను అందించబోతున్నందుకు గ్రామస్తులు శుక్రవారం మాజీ సర్పంచ్ ఎండపల్లి సత్యం ఇంట్లో ఎంపీటీసీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈనేపథ్యాన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు జెడ్పీ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందించారు. సత్యంతో పాటు చెరుకూరి పూర్ణ, మాధంశెట్టి హనుమంతురావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్/కూసుమంచి: గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంటూరు దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండలంలోని కరుణగిరి యూత్ సభ్యుల ఆధ్వర్యాన పాలేరు నియోజకవర్గం స్థాయిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనేపథ్యాన పెదతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎ.కిశోర్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో తుంబూరు సునీల్‌రెడ్డి, వైద్యుడు కె. ప్రదీప్, అశోక్ నాయక్, వీరారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేష్, ఆర్.మురళి, తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామంలోని ఊర చెరువుకు భక్తరామదాసు ప్రాజెక్టు నీటిని ఇబ్బందులు లేకుండా సరఫరా చేసేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలంటూ గ్రామ కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. నాయకులు నెల్లూరి వీరభద్రం, చాట్ల సత్యనారాయణ, వాచేపల్లి హనుమారెడ్డి, కన్నెబోయిన లింగయ్య, రెడ్డెబోయిన రమణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం..



క్యాలెండర్లను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి ఆయన నివాసంలో ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఈ ప్రభుత్వానికి ఎంతో అండగా ఉన్నారని, ప్రభుత్వం ఏర్పడడానికి సహకరించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణతో నిజాయితీగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు షేక్.జిలానీ, ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు షేక్.యాకూబ్‌పాషా, గౌరవ అధ్యక్షుడు నయీమ్‌పాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జమీరుద్దీన్‌లతో పాటు సాధిక్‌అలీ, ఎం.ఏ గఫూర్, ఖాజామొయినుద్దీన్, షేక్.మౌలాన్కర్, షేక్.మదార్, జానీపాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈజీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కూసుమంచి: మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

కామేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కామేపల్లి ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. అదే విధంగా ముచ్చర్ల, జాస్తిపల్లి గ్రామంలో ఈజీఎస్ పని ప్రదేశాల్లో కూలీలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కరరెడ్డి, ఏపీఓ శ్రీరాణి, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల రాంబాబు తదితరులున్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల సంబరాలు..

కూసుమంచి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా ఉద్యోగులు శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు రమాదేవి, జమలారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంబాబు, ఎంపీఓలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ వాల్ పోస్టర్లు..

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పద్మశ్రీ వనజీవి రామయ్య శుక్రవారం చిత్తడి నేలల పరిరక్షణ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా శుభ కార్యాలకు వెళ్లినప్పుడు మొక్క బహూకరించి అది నాటే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైజ్ఞానిక మహాసభల పోస్టర్లు..

నేలకొండపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా బాధ్యులు టి.వెంగళరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఎంపీడీఓ జమలారెడ్డి ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పెద్ది జగన్నాథం, రామారావు, చీనా, బైరం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర 2024 క్యాలెండర్లను ఖమ్మంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిషత్‌లో గీత కార్మిక సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు, సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య, జిల్లా నాయకులు కొండం కరుణాకర్, పామర్తి వాసు, గాలి వెంకటాద్రి, మద్దెల పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై న్యాయ పోరాటానికి సిద్ధం..

ఖమ్మం మామిళ్లగూడెం: సమస్యలపై న్యాయపోరాటానికి సిద్ధం కావాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుచ్చయ్య దొర, ఎస్‌హెచ్‌పీఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రూనాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీకేబజార్ ఎస్టీ సంఘాల జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన హక్కులను కాలరాస్తుంటే ప్రశ్నించినందుకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్‌పై కేసులు పెట్టడం సరైందికాదన్నారు. వెంటనే కేసులు ఎత్తి వేయాలని, లేనిపక్షంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దశరథ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కృష్ణానాయక్, మోహన్‌నాయక్, రామదాసు రాథోడ్, వీరూనాయక్, రాజేశ్‌రాథోడ్, రవీందర్‌నాయక్, నాగేంద్రచారి, 104 డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, ఉపేంద్రబాయి, దేవి తదితరులు పాల్గొన్నారు.

టీ.టీ. పోటీల్లో రాణించిన క్రీడాకారులు..



జ్వాలితను అభినందిస్తున్న డీఈఓ

ఖమ్మం స్పోర్ట్స్: గత నెలలో విజయవాడలో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో నగరానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో నగరంలోని న్యూరిడ్జ్ పాఠశాలకు చెందిన పరిటాల జ్వాలిత ప్రతిభ చాటగా, రాష్ట్రస్థాయిలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని బొంతు సాయి శివానీ తన సత్తా చాటుకుంది. శుక్రవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మ వారిని అభినందించి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ ఓలేటి సాంబమూర్తి, ఆయా పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి..



మాట్లాడుతున్న భూలక్ష్మి

ఖమ్మం మామిళ్లగూడెం: ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని ఖమ్మం బుర్హాన్‌పురంకు చెందిన పోలెపొంగు భూలక్ష్మి కోరారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గతంలో తాను నాలుగో తరగతి ఉద్యోగిగా మధిర, బీసీఎం బంజర బాయ్స్ హాస్టల్లో పనిచేశానని తెలిపారు. తనను భద్రాచలం ఐటీడీఏకు బదిలీ చేయగా.. తాను అక్కడకు వెళితే విధుల్లోకి తీసుకోకుండా తిప్పుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో తాను అనారోగ్యానికి గురయ్యానని, ఎస్సీ కులానికి చెందిన తాను పిల్లల పోషణకోసం కూలి పనులకు వెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి ఉద్యోగంలో చేర్చుకునేందుకు సహకరించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

నేలకొండపల్లి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని అప్పలనరసింహాపురం శివారులో శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బి.రాధాకృష్ణ (50) కాలు విరగడంతో ఆస్పత్రికి తరలించారు.

సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు..

గ్రామ పంచాయతీల్లోని పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడంతో శుక్రవారం సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌లను అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈనేపథ్యాన పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవకు సహకరిస్తామని సర్పంచ్‌లు తెలిపి తమకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, జీపీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగనుండగా.. ఆయా పంచాయతీలకు నియమించబడిన ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: తాళ్లగూడెంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు



నేలకొండపల్లి: కొత్తకొత్తూరు సర్పంచ్ రాధాకృష్ణను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు